# 25. ధర్మబుద్ధి

దభేలుమనే శబ్దం వినగానే ఎందుకోగాని భయంవేసి చప్పున సావిట్లోకి పరుగెత్తాను. ఆమె నేలమీద పడి వుంది. పైన నిచ్చెన వుంది. ఆ దృశ్యం చూసేప్పటికే నాకు చెమట్లు కమ్మినయ్.

నిచ్చెన లాగి "ప్రభా! ప్రభా" అన్నాను.

ఆమె మాట్లాడేస్థితిలో లేనట్టుంది. గచ్చునేలమీద ఎత్తునుంచి పడటంవల్ల దెబ్బ బలంగా తగిలి వుంటుందని తోచింది. మొహాన నీళ్లుకొట్టి విసరసాగాడు. కొంతసేపటికి ఆమె మూలగసాగింది.

"ప్రభా! ఎలా వుందీ?" అన్నాడు.

"అబ్బ!... ఉస్!... అబ్బ!... అయ్యో! యీ చెయ్యి విరిగినట్టుగా వుందండీ!..." బాధతో ఏడ్వసాగింది.

నా మనస్సు పాడైంది. అసలు యీ ఆదివారం సెలవు యివ్వకుండా వుండటం యెంతమంచిదో ఇప్పుడే అర్థమైంది.

"ఆస్పత్రికి వెళ్దాం--" అన్నాను.

"పాడు... ఆస్పత్రి...!"

"అంతకన్న గత్యంతరం లేదు."

ఆమె జవాబు చెప్పకుండా యేడుస్తోంది. బజార్న పొయ్యే జట్కా పిలిచి చాలా శ్రమపడి ఆమెను ఆస్పత్రికి జేర్చాను. వెళ్ళగానే పరీక్ష జరిగింది.

పెద్ద డాక్టరు అన్నాడు: "బొమికె బాగా దెబ్బ తిన్నది. మత్తుమందు కింద దాన్ని సరిచెయ్యాలి--"

మత్తుమందు మాట వినేప్పటికి మళ్ళీ నాకు భయం వేసింది. నాకు తోడు ఎవ్వరూ లేకపోవటం వల్ల నాకు నేనే ధైర్యం చెప్పుకుంటున్నాను.

"మీరేమీ భయపడనక్కర్లేదు. మరేమీ ప్రమాదం లేదు; ఒక్క పది రోజులపాటు ఇక్కడ ఇన్‌పేషెంట్‌గా వుండాల్సి వొస్తుంది-" అని డాక్టర్ ధైర్యం చెప్పాడు.

నేను ఒప్పుకోక తప్పింది గాదు. రెండు గంటలు గడిచాక మళ్ళీ ఆమె దర్శనానికి అనుమతి వొచ్చింది. ఒణికే శరీరాన్ని మెల్లిగా యీడ్చుకుంటూ వెళ్ళాను. మల్లెపువ్వులాంటి దుప్పటి పరిచివున్న మెత్తని పరుపు మీద హాయిగా పడుకొని వుంది. ఎక్కువ బాధపడుతూన్నట్టు తోచలేదు; హైరానై. నలిగి నీరసంగా వున్నట్టుంది.

"ప్రభా! ఇప్పుడెలా వుందీ?"

"బాధ భరించే మోస్తరుగానే వుంది...ఇలాగే యీ పక్కలో కదలకుండా ఒక వారమన్నా వుండాలట."

చేతిమీద కప్పివున్న దుప్పటి తొలిగించి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కట్టిన గట్టికట్టును చూపింది. ఆమె బాధకు సానుభూతిగా నిట్టూర్చి ఫాలభాగాన్ని తాకాను.

నర్స్ గ్లాసులో పాలు తెచ్చింది. ఆమె శుభ్రతా, ఆమె ముఖంలో చిందులాడే సంతోషమూ చూస్తే యీర్ష్యతో బాధపడి, మనం కూడా యీమెలాగా వుండేందుకు ఎందుకు ప్రయత్నం చెయ్యకూడదని అనిపించదా యీ రోగులందరికీ? అసలు ఇంత మంచి ముఖాలమధ్య వుంటేనే సగం రోగం పోతుందేమో?

ప్రభ తలకింద చెయ్యి ఆన్చి మెల్లిగా పాలను తాగించింది. బాధపడే రోగులంటే వీళ్ళకు ఎంత అనురాగం! డబ్బుతో కొనుక్కోలేని అనేక సౌఖ్యాల్ని వీళ్ళు యీ మానవజాతికి ఉచితంగా ఎంత ఆప్యాయంగా అందజేస్తున్నారు!

"చెయ్యి నొప్పిగా వుందా?" అంది నర్స్.

"కొంచెం యిటు ఎత్తుగా వుంటే--" అంది ప్రభ.

చప్పున రెంచ్ తెచ్చి మంచాన్ని కావాల్సినవిధంగా ఎత్తింది నర్స్. ఎంత విశాల హృదయం!

ప్రభ ప్రస్తుత పరిస్థితి చూసి నేను పోగొట్టుకున్న ధైర్యంలో చాలా భాగాన్ని కూడదీసుకున్నాను.

మిగతా రోగుల వైపు నా దృష్టి పోయింది. వాళ్ళల్లో ఎవ్వరూ బాధపడుతూన్న ట్లనిపించ లేదు: బాధను మరిచిపోయినట్టున్నారు. ఆస్పత్రి అంటే భూలోక నరకమనే అభిప్రాయం పోయింది. ఇంటి దగ్గర ఆ బైటి ప్రపంచంలోని బాధల్ని భరించలేక వాటి నుంచి తప్పించుకునేందుకు యీ బుల్లి ప్రపంచంలోకి వీళ్ళందరూ వొచ్చా

రనిపించింది. వరండాలోంచి వీచే ఆ మలయమారుతం తగుల్తేనే సగం బాధలు పోతయ్యనిపించింది.

"మీరిక వెళ్ళిపోవాలి. రాత్రులు ఇక్కడ వుండేందుకు వీల్లేదు--"

"మరి ఆమె స్థితి--?"

"ఆమెకేమీ ఫర్వాలేదు. మేమందరమూ వున్నాం. ఈ హాలులో వున్న యే రోగికన్నా ఆమె ఎక్కువ బాధపడటంలేదు. మీరు మళ్ళీ రేపు ఉదయం రావొచ్చు."

ప్రభ ముఖంలోకి చూశాను.

"నా కేమీ ఫర్వాలేదు. మీరు రేపు వొద్దురు కాని" అంది సంతోషంతో.

కాళ్ళీడ్చుకుంటూ బైట పడ్డాను.

## 2

ఆ రాత్రంతా ప్రభ పరిస్థితి తలుచుకుంటూ దిగులుపడ్డాను. మర్నాడు ఉదయం ఆమెను చూసేందుకు వెళ్ళాను.

"రాత్రి నీకు బాగా నిద్రపట్టిందా?"

"ఓ! బాగా నిద్ర పట్టింది. ఇక్కడ దోమలు లేవు; నల్లులు లేవు. అసలు యీ పక్కమీద పడుకొని యెన్ని రోజులన్నా గడపొచ్చు--"

"ఇవ్వాళ ఎలా వుందీ?"

"మీరు నా విషయం ఏమీ ఆదుర్దా పడనక్కర్లేదు. అరగంట అరగంటకూ నా క్షేమాన్ని విచారించేవాళ్ళ మధ్య నేను వున్నాను--"

ఆ సాయింత్రం మళ్ళీ వెళ్లాను. నేను అడక్కముందే ప్రభ అంది: "అబ్బ! ఎంత సౌఖ్యమయ ప్రదేశమండీ! ఎంత మంచి ఆహారం! ఎంత మంచి గాలి! వాళ్ళిచ్చే 'చికిత్సకు' ఎంతైనా యివ్వొచ్చు. కాని రోజుకు మంచానికి రూపాయేనటగా తీసుకునేది?"

"ఔను--"

"ఎంత చౌకండీ! ప్రాణం ఎంత హాయిగా వుందనీ! తల్లులు తమ గారాబు పిల్లల్ని కూడా యిలా చూస్తారనుకోను. ఇక్కడ వుచితంగా వైద్యం చేస్తారు కనుక రోగుల్ని సరిగ్గా చూడరనుకునేదాన్ని. కాని యీ నర్సులు నిజంగా దేవకన్యలండీ!"

ఆమెతోపాటే నాకూ చాలా తృప్తి కలిగింది.

"నా కొక్క కోర్కె వుందండీ..." అంది తగ్గు స్థాయిలో.

ఈ ఆపత్ సమయంలో ఆమె కోర్కె ఎలాటిదైనా తీర్చాలనే దృఢనిశ్చయంతో, "చెప్పు--" అన్నాను.

"ఇక్కడ వొక దిబ్బెన వుంది. రోగులు నయమయ్యాక వెళ్తూ బీదవాళ్ళ చికిత్స కోసం తమకు తోచిన డబ్బును అందులో వేస్తారు. డబ్బు ఎంతైనా ఫర్వాలేదు. కాని అది యీ దేశంలోని బీదవాళ్ళకు, బాధపడే మానవజాతికి ఉపయోగపడుతుంది. మనం యీ జన్మానికి ఆ కాస్త ధర్మాన్నయినా చేసి తీరాలి--"

"ఇరవై రూపాయిలు వేద్దాం" అని నేను ఒప్పుకుంటానో, లేదోనని నా ముఖంలోకి చూసి మళ్ళీ అంది: "ఇదే యే డాక్టరు దగ్గరన్నా ఐతే ఏ యాభయ్యో తీసుకునే వాడు... ఐనా అక్కడంత మంచి వైద్యసహాయం లభించేది కాదు...ఏమంటారూ?"

"అలాగే వేద్దాం. నీకు త్వరగా నయం కావాలి కాని ఇలాటి ఖర్చులు మనం ఎన్ని పెట్టటంలేదు?"

ఆమె తృప్తిగా నవ్వింది.

పది రోజులయ్యాక ఇక యింటికి వెళ్ళొచ్చున్నారు. ప్రాణ గండం గడిచిం దనిపించింది... ఇంటికి బయలుదేరేందుకు సిద్ధంగా వున్నాం.

"బండి పిలవండి..." అందామె.

"కింద సిద్ధంగానే వుంది."

"ఐతే పదండి పోదాం"

ఆమె మరిచిపోయిన సంగతి ఇప్పుడే జ్ఞాపకం వొచ్చి, జేబులోంచి రెండు పదిరూపాయిల నోట్లను తీసి ఆమెకు యిస్తూ అన్నాను: "ఆ నాడు నువ్వు ఆస్పత్రికి యిరవై రూపాయిలు ధర్మం చేద్దామన్నావ్; చేసెయ్--"

ఆమె ఆశ్చర్యపోతూ అంది: "ఇరవయ్యే! మంచివారే! దానాలకూ ధర్మాలకూ మన దగ్గర ఏమంత డబ్బు వుందీ! మనం యేమన్నా భాగ్యవంతులమా? మనం కూడా బీదవాళ్ళల్లో లెక్కే!"

"పది రోజుల క్రితం భాగ్యవంతులమూ కాదు. ఈనాడు బీదవాళ్ళమూ కాదు. నువ్వు అనే ఆ బీదరికాన్ని మనకు మనమై తెచ్చుకొని బాధపడతాం. ఇలాటివి ఎన్ని ఖర్చుపెట్టడంలేదు?"

"ఇలాటివి అనకండి..బట్టలు చౌకయినయ్. ఈ డబ్బుకు నాకు ఒక మంచి చీర వొస్తుంది--"

"పోనీ చీరె కూడా కొనుక్కోవచ్చు; అది వేరే విషయం, అది మన వ్యక్తిగత సౌఖ్యం. కాని ఇది దేశంలోని బీదవాళ్ళందరికీ, బాధపడే మానవజాతికి మన శక్తి వంచన లేకుండా చేసే సహాయం."

"అబ్బ! మీతో నేను వాదించలేను. ఈ ఆస్పత్రివాళ్ళకు ఇచ్చే తాహతు మనకుందని మీరు భ్రమపడుతున్నారు. వాళ్ళకు అమెరికా నుంచి కోట్లరూపాయలు చందాలు వొస్తయ్. ఎంత డబ్బు లేకపోతే ఇంతమంది రోగులకు ఇంత మంచి చికిత్స ఇస్తూ సౌఖ్యపెట్ట గలుగుతున్నారనుకున్నారు?"

"అది కాదు ప్రభా! మన శక్తికొద్దీ--"

"మహావుందిలెండి శక్తి! శక్తిట! ఇలా డబ్బు తగలేస్తే--"

ఇక నాతో ఆస్పత్రిలో వాదించటం తన తాహతుకు తగదనుకుంది కాబోలు- విసుగుతో గిరుక్కున తిరిగి మెట్లు దిగనారంభించింది. నాలో నేనే నవ్వుకుంటూ ఆమెను అనుసరించాను.

బండి ఆస్పత్రి ఆవరణ దాటగానే "ఇలాంటి ఆస్పత్రులు మన దేశంలో వుండటం చాలా అవసరమే కాని మన సహాయం యేమిటి చెప్పండి... ఇంకొక్క పది రూపాయిలు వేసి, రెండు మంచి కోయంబత్తూరు చీరెలు కొనుక్కుంటే-" అని నోట్లను భద్రంగా మడిచి జాకెట్‌లోకి తోస్తూ నా ముఖంలోకి చూస్తూ విజయసూచకంగా నవ్వింది.

*- జనవరి, 1945*